
# ₹400కే సిలిండర్


## మ్యానిఫెస్టోలో ప్రకటించిన బీఆర్ఎస్

**సామాన్యుల కష్టాలు గుర్తెరిగిన సీఎం కేసీఆర్**

**అధికారంలోకి రాగానే అమలుకు శ్రీకారం**

**ఉమ్మడి జిల్లాలో 11.13 లక్షల కనెక్షన్లు**






నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్ 19 (నమస్తే తెలంగాణ) : సామాన్యుల ముఖ్యమంత్రిగా బీదబిక్కి కష్టాలు గుర్తెరిగిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మరో మానవీయ పథకానికి రూపకల్పన చేశారు. కేంద్రంలోని మోదీ సర్కార్ పేదల ఇండ్లల్లో క్రమంగా గ్యాస్ పొయ్యిలను ఆర్పే ప్రయత్నాలు చేస్తుంటే.. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్ర ప్రజలపై భారం తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. మూడోసారి అధికారంలోకి వస్తే వంట గ్యాస్ సిలిండర్‌పై భారీ రాయితీ ఇస్తామని ప్రకటించారు. కేంద్రం పెంచే ధరలతో సంబంధం లేకుండా రూ.400కే సిలిండర్ అందజేస్తామని సంచలన ప్రకటన చేశారు. ఉమ్మడి జిల్లాలో మొత్తం 11.13 లక్షల గ్యాస్ కనెక్షన్లు ఉండగా.. ప్రతి నెలా 3.65లక్షల సిలిండర్లు రీఫిల్ అవుతున్నట్లు అంచనా. ఒక్కో సిలిండర్‌పై ప్రస్తుతం ఉన్న రేట్ల ప్రకారం చూస్తే.. రూ.600 వరకు భారం తగ్గనున్నది.

కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గ్యాస్ ధరలను ఇష్టారాజ్యంగా పెంచుకుంటూ పోయింది. అంతర్జాతీయంగా ధరలు తగ్గినా, మన దగ్గర మాత్రం తగ్గించలేదు. దీంతో అన్ని రంగాలపై ప్రభావం చూపుతున్నది. ముఖ్యంగా సామాన్యులు గ్యాస్ సిలిండర్ కొనలేని పరిస్థితి. ఒకప్పుడు కట్టెల పొయ్యి పొగలతో అనారోగ్యంపాలైన గృహిణులు గ్యాస్ రాకతో ఆ బాధ నుంచి తప్పించుకున్నారు. ఇప్పుడు సిలిండర్ ధర పెంపుతో మళ్లీ కట్టెల పొయ్యి పెట్టాల్సి వస్తుందేమోనని పేద మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఈ నేపథ్యంలో మానవీయ కోణంలో ఆలోచించిన ముఖ్యమంత్రి కేసీఆర్ రూ.400కే గ్యాస్ బండ ఇస్తామని బీఆర్ఎస్ మ్యానిఫెస్టోలో ప్రకటించారు. దీంతో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 8.50 లక్షల గ్యాస్ వినియోగదారులకు లబ్ధి చేకూరనుంది. తద్వారా సగటున నెలకు వినియోగదారులకు రూ.22 కోట్లకు పైగా భారం తగ్గనున్నది.

### నాడు రూ.410.. నేడు రూ.1010

కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం వచ్చాక గ్యాస్ ధరలు పెరుగుతూనే ఉన్నాయి. ఏకంగా 15 సార్లు గ్యాస్ సిలిండర్ ధరలను పెంచింది. మోదీ అధికారంలోకి వచ్చే నాటికి గ్యాస్ సిలిండర్ ధర 410 రూపాయలు ఉన్నది. ఇప్పుడు రెండు రెట్లు దాటిపోయింది. గురువారం గ్యాస్ ధర రూ.1010 ఉంది. కేంద్రం ఓ వైపు గ్యాస్ ధరలు పెంచుతూనే.. మరో వైపు గ్యాస్ సబ్సిడీకి మంగళం పాడే ప్రయత్నం చేస్తున్నది. 2014కు ముందు గ్యాస్ సబ్సిడీ విధానం లేదు. బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్యాస్‌పై అధికంగా వసూలు చేస్తూ.. అందులోంచి సబ్సిడీ పేరుతో తిరిగి ఇచ్చే చెత్త విధానానికి శ్రీకారం చుట్టింది. కానీ.. అది కూడా సక్కగా అమలు కావడంలేదు. రాను రాను సబ్సిడీని తగ్గిస్తూ పోతున్నది. ఇప్పుడు ఒక్కో సిలిండర్‌పై అతి తక్కువగా 40 రూపాయలు మాత్రమే సబ్సిడీ ఇస్తున్నది.

### ఉమ్మడి జిల్లాలో నెలకు రూ.22 కోట్లు మిగులు

ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధరను పరిగణలోకి తీసుకుంటే ఉమ్మడి జిల్లాలోని గ్యాస్ వినియోగదారులపై నెలకు సుమారు రూ.22కోట్ల భారం తగ్గనుంది. ప్రస్తుతం వంట గ్యాస్ సిలిండర్ ధర వెయ్యి రూపాయలు ఉన్నది. దీనిని రూ.400కు అందజేస్తే మిగిలిన భారాన్నంతటినీ రాష్ట్ర ప్రభుత్వమే భరించనుంది. ప్రభుత్వ లెక్కల ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం 73 గ్యాస్ ఏజెన్సీలు ఉండగా.. వాటి పరిధిలో సుమారు 8.50 లక్షల గ్యాస్ వినియోగదారులు ఉన్నారు. వీరికి సంబంధించిన సుమారు 11.13 లక్షల గ్యాస్ సిలిండర్లు వినియోగంలో ఉన్నాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే నల్లగొండలో 4.97లక్షలు, సూర్యాపేటలో 4.05లక్షలు, యాదాద్రి భువనగిరిలో 2.10లక్షల గ్యాస్ సిలిండర్లు వినియోగంలో ఉన్నాయి. 14.2 కిలోల ఒక్కో గ్యాస్ బండను రూ.400కే అందిస్తే రూ.600 భారం తప్పనుంది. ఉమ్మడి జిల్లాలో వినియోగంలో ఉన్న మొత్తం గ్యాస్ సిలిండర్లలో నెలకు సుమారు 3.65లక్షల సిలిండర్లు రీఫిల్‌కు వస్తున్నట్లు అంచనా. రూ.400కే గ్యాస్ సిలిండర్ అందజేస్తే ప్రతి నెలా సుమారు రూ.22 కోట్ల భారం ప్రజలపై తగ్గనుంది. దీంతో సీఎం కేసీఆర్ ప్రకటించిన గ్యాస్ సిలిండర్ పథకంపై ప్రజల్లో సంతోషం వ్యక్తమవుతున్నది. ఇప్పటికే బీపీఎల్ కుటుంబాలన్నింటికీ సన్న బియ్యం అందజేస్తామని ప్రకటించగా.. ఇక ముందు వంట గ్యాస్ భారం కూడా లేకుండా చేయాలనుకోవడం హర్షణీయమని సామాన్యులు ప్రశంసిస్తున్నారు.

### రూ.400కే వంట గ్యాస్ సిలిండర్

ఇప్పటికే రెండు సార్లు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ సర్కార్ అనేక అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా చేపట్టింది. పేదల సంక్షేమమే లక్ష్యంగా వినూత్న పథకాలతో దేశానికే రోల్ మోడల్‌గా నిలిచింది. ఆసరా పింఛన్లు, కల్యాణలక్ష్మి, షాదీముబారక్, కేసీఆర్ కిట్, ఆరోగ్య మహిళ, ఉచిత కరెంటు, రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ ఇలా ఎన్నెన్నో పథకాలను తొమ్మిదిన్నరేండ్లలో అమలు చేసి చూపింది. దీంతోపాటు సాగునీటి ప్రాజెక్టుల నిర్మాణం, పారిశ్రామిక ప్రోత్సాహకాలతో రాష్ట్ర తలసరి ఆదాయం కూడా మూడు రెట్లు పెరిగింది. వీటన్నింటి నేపథ్యంలో ప్రస్తుత ఎన్నికల్లో మరోసారి విజయం సాధిస్తే మరిన్ని మానవీయ పథకాల అమలుకు బీఆర్ఎస్ సన్నద్ధం అవుతున్నది. అందులో కీలకమైన పథకాల్లో రూ.400కే వంట గ్యాస్ సిలిండర్ ఒకటి. దీని ద్వారా పేదలపై ఆర్థిక భారం తగ్గించాలన్నదే సీఎం కేసీఆర్ సంకల్పం. అందుకే కేంద్ర ప్రభుత్వ ధరతో సంబంధం లేకుండా వంట గ్యాస్ సిలిండర్‌ను 400 రూపాయలకే ఇస్తామని ప్రకటించారు.

### ఇగ గ్యాస్ పొయ్యిపై వంట జేస్త



సిలిండర్ ధర రూ.400 ఉన్నప్పుడు గ్యాస్ పొయ్యిపై వంట చేసిన. కేంద్ర సర్కారోళ్లు వంట గ్యాస్ ధర పెంచుతుండడంతో సిలిండర్ వాడకుండా మూలకేసిన. రూ.1100 అయ్యే సరికి కట్టెల పొయ్యిపైనే వంట జేస్తున్న. పొగ రాంగ, కండ్లు మండంగ, ఇల్లంత పొగచూరంగ వంట జేస్తున్న. ఇగ సుట్టాలొస్తే మా గోస చెప్పరాకుండా ఉంది. సీఎం కేసీఆర్ సారు మా బాధలు చూసి రూ.400కే గ్యాస్ బండ ఇస్తనంటున్నడు. మల్ల మూలకేసిన గ్యాస్ పొయ్యిని బయటకు తీసి వంట జేసుకుంటా.

– ఆరె బాలమ్మ, ఆలేరు

### 400 రూపాయలకే గ్యాస్ సిలిండర్ హర్షణీయం



కేంద్ర ప్రభుత్వం గ్యాస్ ధర పెంచి పేదలకు అందుబాటులో లేకుండా చేసింది. సిలిండర్ ధర రూ.1100కు చేరింది. దీంతో పేదలు గ్యాస్ మీద వండుకోలేని పరిస్థితి దాపురించింది. రాష్ట్రంలో 3వ సారి బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ రూ.400కే ఇవ్వాలని మ్యానిఫెస్టోలో పెట్టడం హర్షణీయం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే మహిళలకు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇస్తామని చెప్పడం హాస్యాస్పదంగా ఉన్నది. కాంగ్రెస్ పార్టీని ప్రజలు నమ్మే స్థితిలో లేరు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఎప్పటికీ పేదల పక్షాన నిలుస్తుంది. ఎన్నో సంక్షేమ పథకాలు సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టి పకడ్బందీగా అమలు చేస్తున్నారు. మరో మారు కేసీఆర్ ప్రభుత్వాన్ని గెలిపిస్తాం.

– దూడల స్రవంతి, కొలనుపాక (ఆలేరు రూరల్)

### ప్రజల కష్టాలు తెలిసిన నాయకుడు సీఎం కేసీఆర్



ప్రతి ఇంట్లో నిత్యం అవసరంగా మారిన వంట గ్యాస్ ధరలను బీజేపీ ప్రభుత్వం అడ్డగోలుగా పెంచడంతో పేదరికంలో ఉన్న మాలాంటి కుటుంబాలకు ఎంతో భారంగా మారింది. ఇలాంటి తరుణంలో సీఎం కేసీఆర్ సార్ వంట గ్యాస్ ధరలను నాలుగు వందలకు తగ్గించనున్నట్లు ప్రకటించడంతో ఎంతో సంతోషం కలిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో వంట గ్యాస్ వినియోగం తప్పనిసరి అయ్యింది. ప్రజల కష్టాలు తెలిసిన సీఎం కేసీఆర్ గ్యాస్ సిలిండర్ ధర తగ్గిస్తామని చెప్పడం మాలాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఊరటనిచ్చింది.

– గడిపె రజిత, గృహిణి, వీరారెడ్డిపల్లి, తుర్కపల్లి మండలం

### సీఎం కేసీఆర్ హామీ ఇస్తే కచ్చితంగా అమలు చేస్తారు



400 రూపాయలకు గ్యాస్ సిలిండర్ ఇస్తానని హామీ ఇవ్వడం బాగుంది. ముఖ్యమంత్రి కేసీఆర్ హామీ ఇచ్చాడంటే కచ్చితంగా అమలు చేస్తారు. కేంద్రంలోని మోదీ సర్కారు వంట గ్యాస్ రేటు పెంచి నిరుపేదలపై చాలా భారం వేశారు. రూ.1250 వరకు పెంచి ఇటీవల 200 రూపాయలు తగ్గించామని చెబుతున్నారు. కానీ.. ఎన్నికల తరువాత మోదీ మళ్లీ రేటు పెంచడనే గ్యారంటీ అయితే లేదు. ఇప్పుడు ఉన్న వారిలో బీఆర్ఎస్ పార్టీ ఒక్కటే కచ్చితంగా ఇచ్చిన హామీ నిలబెట్టుకుంటుందన్న నమ్మకం ఉంది. ఇప్పటి వరకు తెలంగాణ ప్రభుత్వం దాదాపుగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేసింది. పేదల కష్టాలు గుర్తించిన సీఎం కేసీఆర్ దాదాపుగా సగానికంటే ఎక్కువ సబ్సిడీ ఇచ్చి పేదల మీద భారం పడకుండా చేస్తానని చెప్పడం చాలా సంతోషం.

– సీహెచ్ లక్ష్మి, గృహిణి (చౌటుప్పల్ రూరల్)

### పేదల గోస తెలిసిన వ్యక్తి మన కేసీఆర్



బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే గ్యాస్ సిలిండర్ 400 రూపాయలకే ఇస్తామని మ్యానిఫెస్టోలో పెట్టినందుకు గృహిణిగా చాలా సంతోషపడ్డాను. పెరిగిన గ్యాస్ సిలిండర్ ధర మా లాంటి పేద, మధ్య తరగతి కుటుంబాలకు మోయలేని భారం అవుతుంది. కేంద్రంలోని బీజేపీ అధికారంలోకి వచ్చిన కొత్తలో సిలిండర్‌కు సబ్సిడీ ఇచ్చినట్టే ఇచ్చి మధ్యలో చేతులెత్తేసింది. వారికి పేదల గోస తెల్వదు. పేదల పట్ల చిత్తశుద్ధి లేదు. మా లాంటి పేదలకు ఏది అవసరమో తెలిసిన వ్యక్తి మన కేసీఆర్. పెరిగిన గ్యాస్ ధరలతో పేదలు మళ్లీ కట్టెల పొయ్యి మీద ఆధారపడే రోజులు దాపురిస్తున్న తరుణంలో 400రూపాయలకే గ్యాస్ సిలిండర్ ఇస్తానని చెప్పడంతో ఎంతో సంతోషిస్తున్నాం. ఇన్ని చేస్తున్న ముఖ్యమంత్రికి ధన్యవాదాలు. అందుకే కేసీఆర్ సారు మళ్లీ అధికారంలోకి రావాలని కోరుకుంటున్నా.

– కోల ధనలక్ష్మి, రాంనగర్, మిర్యాలగూడ

### కేసీఆర్ సార్ మాట ఇస్తే తప్పే వ్యక్తి కాదు



ముఖ్యమంత్రి కేసీఆర్ సార్ అంటే రాష్ట్ర ప్రజలకు ఓ నమ్మకం. ఆయన మాట ఇస్తే తప్పే వ్యక్తి కాదు. పెరిగిన వంట గ్యాస్ ధరలతో సామాన్యులు చాలా ఇబ్బంది పడుతున్నారు. ప్రతి నెలా రూ.955 పెట్టి గ్యాస్ కొనాలంటే భారంగా ఉంది. పేద మహిళల వంటింటి కష్టాలు అర్థం చేసుకొని రూ.400కే గ్యాస్ సిలిండర్ ఇస్తామని బీఆర్ఎస్ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించడం సంతోషకరం. దీంతో లక్షలాది కుటుంబాలకు మేలు జరుగనున్నది. గత ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా అనేక పథకాలు తీసుకొచ్చి అమలు చేసిండ్రు. దీంతో రాష్ట్ర ప్రజలకు బీఆర్ఎస్ ప్రభుత్వంపై నమ్మకం కుదిరింది. ఒక వర్గం అని కాకుండా ప్రజలందరికీ ఆమోదయోగ్యమైన పాలన అందించి రెండు సార్లు అధికారంలోకి వచ్చి రుజువు చేసుకున్నారు. మూడోసారి కూడా కేసీఆర్ సార్ సీఎం కావాలి.

– సింగం రజిత, గృహిణి, పులిపలుపుల, మునుగోడు మండలం



నూతన ఆంపి థియేటర్ (ఓపెన్ ఆడిటోరియం)

# ప్రగతి పథంలో ఎంజీయూ

## స్వరాష్ట్రంలో యూనివర్సిటీకి అధిక నిధులు

**అత్యాధునిక వసతులతో నూతన భవనాల నిర్మాణం**

**కొత్త కోర్సులు ప్రారంభం.. పాత కోర్సుల్లో సీట్ల పెంపు**

**సెంట్రల్ లైబ్రరీలో అందుబాటులో 50వేల జర్నల్స్**

**విండ్ పవర్ ఉత్పత్తికి పాలకమండలి ఆమోదం**

**త్వరలో విద్యార్థులకు ప్రాక్టికల్స్**

రామగిరి, అక్టోబర్ 17 : స్వరాష్ట్రంలో మహాత్మాగాంధీ యూనివర్సిటీ అభివృద్ధి వైపు పరుగులు తీస్తున్నది. ప్రభుత్వం అధిక నిధులు ఇస్తుండడంతో కొత్త రూపు సంతరించుకుంటున్నది. ఆధునిక వసతులతో భవన నిర్మాణాలు చేపట్టగా.. కొత్త కోర్సులు అందుబాటులోకి వచ్చాయి. పాత కోర్సుల్లో సీట్ల పెంపుతో మరింత మంది విద్యార్థులకు చదువుకునే అవకాశం దక్కింది. విద్యార్థులకు పరిశోధన అవకాశాలు కల్పిస్తుండడంతో ఇప్పటికే ఎంతో మంది పీహెచ్‌డీ పట్టాలు పొందారు. టీఎస్ ఎడ్‌సెట్ నిర్వహణ, అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతంగా నిర్వహించి శభాష్ అనిపించుకుంటూ ఇతర వర్సిటీలకు దీటుగా ఎంజీయూ ముందుకు సాగుతున్నది. వర్సిటీలో ప్రతి డిపార్ట్‌మెంట్‌లో డిజిటల్, వర్చువల్ తరగతులను వేర్వేరుగా నిర్వహిస్తున్నారు. ఆన్‌లైన్ వాల్యుయేషన్, డిజి లాకర్‌తో విద్యార్థులకు సర్టిఫికెట్లు, పలు ఉన్నత సంస్థలతో ఉన్నత విద్యకు పరస్పర ఒప్పందాలు చేయడంతో ఎంతో మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించారు.

### అందుబాటులోకి కొత్త కోర్సులు

ఎంజీయూ వీసీ ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి విద్యార్థులకు పలు వసతులను అందుబాటులోకి తెచ్చారు. 2022-23 విద్యా సంవత్సరంలో ఎమ్మెస్సీ బోటనీ కోర్సు ప్రారంభించారు. వర్సిటీలో ఇప్పటికే ఉన్న 14కోర్సుల్లో అదనంగా 140 సీట్లు పెంచారు. ఈ విద్యా సంవత్సరం ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ కోర్సును 60 మంది విద్యార్థులతో ప్రారంభించగా అడ్మిషన్లు పూర్తయ్యాయి. అదేవిధంగా ఎంఏ సైకాలజీ కోర్సును 50 మంది విద్యార్థులతో అవకాశం కల్పించారు. ఇప్పటికే 60 కిలో వాట్స్‌తో సోలార్ పవర్‌ను ఉత్పత్తి చేస్తున్నారు. అదే స్థాయిలో ఎమ్మెస్సీ ఫిజిక్స్ కోర్సు విద్యార్థులకు విండ్ పవర్‌ను పరిచయం చేసేలా ఒక కిలో వాట్స్ ఉత్పత్తి సామర్థ్యం కలిగిన విండ్ పవర్ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తూ ఇతర వర్సిటీలకు రోల్‌మోడల్‌గా నిలిచేలా కృషి చేస్తున్నారు.



నూతన పరీక్షల విభాగ భవన సముదాయం

### సెంట్రల్ లైబ్రరీలో 50వేల జర్నల్స్

యూనివర్సిటీ సెంట్రల్ లైబ్రరీలో తెలంగాణలో ఇతర వర్సిటీల్లో అందుబాటులో లేనివిధంగా 'జెగేట్'తో ఆన్‌లైన్‌లో 50వేల జర్నల్స్ చూసుకునే అవకాశం కల్పించారు. అదేవిధంగా లైబ్రరీలో ఉచిత ఇంటర్నెట్‌తో 20 కంప్యూటర్లను అందుబాటులో ఉంచారు. ప్రభుత్వం విడుదల చేసిన పలు పోటీ పరీక్షలకు అవసరమైన పుస్తకాలను అందుబాటులోకి తేవడంతో విద్యార్థులతో నిత్యం లైబ్రరీ సందడిగా ఉంటున్నది.

### నూతన భవనాల నిర్మాణం

ప్రస్తుతం అరకొర వసతులతో ఆర్ట్స్ బ్లాక్‌లో కొనసాగుతున్న ఎంజీయూ పరీక్షల విభాగాన్ని ఈ నెల 14న నూతన అధునాతన భవనంలోకి మార్చారు. 1500 మంది కూర్చొని సమావేశాలు జరిపేలా ఆంపి థియేటర్‌ను అందుబాటులోకి తెచ్చారు. నూతన ఇంజినీరింగ్ కళాశాల భవన నిర్మాణం పూర్తికాగా.. త్వరలో ప్రారంభం కానున్నది.

### విజయవంతంగా టీఎస్ ఎడ్‌సెట్ నిర్వహణ

టీఎస్ పీఈసెట్ (తెలంగాణ ఫిజికల్ ఎడ్యుకేషన్ టెస్ట్)ను ఎంజీయూ ఆధ్వర్యంలో ఆరు సంవత్సరాలుగా విజయవంతంగా నిర్వహిస్తున్నారు. దీంతో ఈ విద్యా సంవత్సరం టీఎస్ ఎడ్‌సెట్ (తెలంగాణ స్టేట్ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్) నిర్వహణ బాధ్యతను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ఎంజీయూకు అప్పగించింది. పరీక్షతోపాటు అడ్మిషన్ల ప్రక్రియను విజయవంతంగా కొనసాగిస్తున్నారు.

### అన్ని రంగాల్లో అభివృద్ధి



రాష్ట్ర ప్రభుత్వ సహకారంతో నల్లగొండలోని ఎంజీయూలో విద్యార్థులకు వసతులు మెరుగుపరిచి అభివృద్ధి చేపడుతున్నాం. గత సంవత్సరం ఎమ్మెస్సీ బోటనీ కోర్సు అందుబాటులోకి తెచ్చాం. గ్రామీణ ప్రాంత విద్యార్థులకు లబ్ధి చేసేలా పాలకమండలి నిర్ణయంతో ప్రస్తుత విద్యా సంవత్సరం ఇంజినీరింగ్‌లో సీఎస్ఈ, ఆర్ట్స్‌లో ఎంఏ సైకాలజీ కోర్సులను అందుబాటులోకి తెచ్చాం. సాంకేతికతో పరీక్షల విధానంలో పలు మార్పులు చేశాం. గతంలో ఉన్న విద్యార్థుల సంఖ్యకు అదనంగా 300మంది విద్యార్థులకు వసతి కల్పించేలా బాల, బాలికలకు వేర్వేరుగా హాస్టళ్లను, నూతన పరిశోధనలకు పీహెచ్‌డీని అందుబాటులోకి తెచ్చాం.

– ప్రొఫెసర్ సీహెచ్ గోపాల్‌రెడ్డి, ఎంజీయూ వీసీ

# అల్లరి

ALLARI

**చెప్పుకోండి**



1. సాంబార్ సరస్సు ఏ రాష్ట్రంలో ఉన్నది?
2. ఉర్దూ కాకుండా మిగిలిన భారతీయ భాషలకు మూల లిపి ఏది?
3. నోబెల్ బహుమతి పొందిన మొదటి భారతీయుడు ఎవరు?



Little Miss Muffet
Sat on a tuffet,
Eating her curds and whey;
Along came a spider,
Who sat down beside her
And frightened Miss
Muffet away

**పదసృష్టి**



కింద ఇచ్చిన పదంలోని అక్షరాల సాయంతో ఎన్ని కొత్త పదాలను సృష్టించగలరో చూడండి.

Hotel

Ex : Hot

## చేసిన సాయం

**కథ**

### సీతాపురం నివాసి

ధర్మయ్య వడ్డీవ్యాపారం చేస్తుంటాడు. చుట్టు పక్కల గ్రామాల ప్రజలు డబ్బు అవసరం ఏర్పడినప్పుడు.. ఏదైనా వస్తువును ధర్మయ్య దగ్గర తనఖా పెట్టి, అప్పు తెచ్చుకుంటారు. పక్క గ్రామం పార్వతీపురంలోనూ రామయ్య అనే వ్యాపారి ఉండేవాడు. అతను బాగా డబ్బున్న వ్యక్తి. పది ఎకరాల భూమి కూడా ఉంది. అతను కూడా అవసరమైన వారికి వడ్డీ లేకుండానే చిన్నమొత్తంలో అప్పులు ఇస్తుంటాడు. అయితే.. రామయ్యకు ఒక చెడ్డ గుణం ఉంది. 'ఫలానా వారికి అవసరమైతే.. డబ్బులు ఇచ్చాను!' అంటూ, కనిపించిన వారికల్లా గొప్పగా చెప్పుకొనేవాడు. తన మిత్రుడైన చంద్రయ్య ఒక రోజు రామయ్య ఇంటికి వచ్చాడు. ''రామయ్యా! ఈ మండలం మొత్తం నీ పేరు మార్మోగుతున్నది! అవసరం ఉన్న వారికి వడ్డీలేకుండానే డబ్బులు ఇస్తున్నావట?'' అన్నాడు. ''అవును మరి. సీతాపురం ధర్మయ్యలా నేను వడ్డీ వ్యాపారం చేయడం లేదు కదా! అతను వడ్డీ వ్యాపారంలో బాగా సంపాదిస్తున్నాడని అందరూ చెప్పుకొంటుంటారు. అలాగే, ఏదైనా వస్తువును తనఖా పెట్టుకోనిదే నయా పైసా కూడా ఇవ్వడట కదా!?'' అన్నాడు రామయ్య. ''ఆయన గురించి తెలియని వారు అలాగే అనుకుంటారు. నిజానికి ధర్మయ్య వస్తువులను తాకట్టు పెట్టుకుని ధనం సహాయం చేసేది.. తీసుకున్న వాళ్లు ఎగ్గొట్టకుండా ఉండటానికే! అసలుతోపాటు వడ్డీ ముట్టిన తరువాత.. అప్పు తీసుకున్నవారి ఇంట్లో ఏదైనా వేడుక జరిగితే, ధర్మయ్య తప్పక హాజరవుతాడు. వారివద్ద తీసుకున్న వడ్డీ డబ్బు మొత్తాన్నీ, తిరిగి వారికే కానుకగా ఇస్తుంటాడు'' అంటూ ధర్మయ్య మంచితనం గురించి అసలు విషయం చెప్పాడు చంద్రయ్య. ''అయ్యో! ఈ విషయం నాకు తెలియదు'' అన్నాడు రామయ్య. ''ధర్మయ్య చేస్తున్న సాయం మూడో కంటికి తెలియదు. నువ్వు కూడా ప్రజలను అవసరానికి ఆర్థికంగా ఆదుకున్నా.. గొప్పగా ఊరంతా ప్రచారం చేసుకుంటున్నావు. ఇది మంచి పద్ధతి కాదు!'' అంటూ చంద్రయ్య హితవు చెప్పాడు. ''చంద్రయ్యా! నా తప్పు తెలుసుకున్నాను. ఇక మీదట ఎప్పుడూ అలా చేయను'' అన్నాడు రామయ్య.

**నీతి :** కుడి చేతితో చేసిన సాయం ఎడమ చేతికి కూడా తెలియకూడదు.

● యు.విజయశేఖర రెడ్డి





**జవాబులు**

చెప్పుకోండి : 1. తమిళనాడు, 2. బ్రాహ్మి, 3. రవీంద్రనాథ్ ఠాగూర్
పూరించండి : NURSE, ORANGE

**పూరించండి**

బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి



జి. వినయ్, హవేలీ ఘనపూర్

పిల్లలూ! మీరు గీసిన బొమ్మలు, రాసిన కథలు, జోక్స్ మాకు పంపండి. బాగుంటే ప్రచురిస్తాం.
మా చిరునామా: zindagi@ntnews.com

**జతచేయండి**



కింది బొమ్మలను వాటి సరైన నీడలతో జతచేయండి

